


ప్రలోభాలు..

- ఉపాధ్యాయ ఓటర్లకు గిఫ్ట్ బాక్సులు
- పట్టభద్రుల ఓటర్లకు డిన్నర్ సమావేశాలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ ఎత్తులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఇంకా నెల రోజులు గడువున్నప్పటికీ అప్పుడే ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు అధికార పార్టీ అభ్యర్థులు సన్నద్ధమయ్యారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు ప్రత్యేకంగా డిన్నర్ సమావేశాలను అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేస్తున్నారు. మరోపక్క గిఫ్ట్ బాక్సులను పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఓటర్లకు అధికార పార్టీ అభ్యర్థి పేరుతో పంపిణీ చేస్తున్నారు. అధికారులు మాత్రం అధికార పార్టీ నేతల చర్యలను నిలువరించకుండా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికలకు ఇటీవల ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ రెండు



స్థానాలకు 16న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానానికి అధికార పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి బరిలో ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి రామచంద్రారెడ్డి పోటీ చేస్తున్నారు. ఇటీవల కాలంలో అధికార పార్టీపై పెద్ద ఎత్తున ఉద్యోగులు, కార్మికులు, యువకుల్లో వ్యతిరేకత నెలకొంది. ఈ వ్యతిరేకతను పోలింగ్ నాటికి రూపుమాపుకునేందుకుగాను అధికార పార్టీ ప్రలోభాల చర్యలకు పూనుకున్నారు. ఈ రెండు స్థానాల్లో ఉన్న ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి పేరుతో అన్ని పాఠశాలల్లో గిఫ్ట్ బాక్స్‌లను పంపిణీ చేపడుతున్నారు. ఉదయం పాఠశాలలకు టీచర్లు రాకముందుకే ఈ గిఫ్ట్ బాక్స్‌లను పాఠశాలల్లో ఉండేలా అధికార పార్టీ నేతలు చర్యలు చేపట్టారు. అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు అధికార పార్టీ అభ్యర్థి రామచంద్ర రెడ్డి పేరుతో వచ్చిన గిఫ్ట్ బాక్సులను తీసుకోకుండా నిరాకరిస్తున్నారు. ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిపై గ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టభద్రుల ఓటర్లను కూడా తమ వైపు తిప్పుకునేందుకు అధికార పార్టీ నేతలు ప్రత్యేకంగా డిన్నర్లను ఏర్పాటు చేశారు. ఇటీవల కర్నూల్‌లో నిర్వహించిన డిన్నర్‌లో ఓటర్లకు మద్యం కూడా సరఫరా చేసినట్లు తెలిసింది. ఇలాంటి డిన్నర్ సమావేశాలను నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో నిర్వహించేందుకు కూడా అధికార పార్టీ నేతలు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నప్పటికీ ఎన్నికల అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతల చర్యలను పలువురు ఖండిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నీటి వాటా 'భద్ర'మేనా?

- అప్పర్ భద్రకు నిధుల కేటాయింపుతో ఆందోళన
- కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలపై ప్రభావం - నేడు కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం నిరసన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు, అనంతపురమ, కడప జిల్లాకు తుంగభద్ర నుంచి అందే నీటి వాటా భద్రంగా ఉంటుందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. దీనికి ప్రధాన కారణం అప్పర్‌భద్ర ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో భారీ ఎత్తున నిధులు కేటాయించడమే. అప్పర్ భద్ర నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు...

తుంగభద్ర ఎగువ భాగంలో కర్నాటక చేపట్టిన అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 2023-24 బడ్జెట్లో రూ.5300 కోట్లు కేటాయించింది. తుంగభద్ర డ్యామ్‌పై తుంగ, భద్ర నదుల రెండూ కలిసి తుంగభద్రగా హొస్పేట్ వద్ద ఏర్పడుతాయి. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రాష్ట్రాలకు నీటిని అందించే బహుళార్థక ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో 130 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించారు. అయితే పూడిక కారణంగా ప్రస్తుతం దీని నీటి నిలువ సామర్థ్యం 100 టిఎంసిలకు పరిమితమైంది. ఈ ప్రాజెక్టు నుంచి హెచ్ఎల్‌సి(ఎగువ ప్రధాన కాలువ), ఎల్ఎల్‌సి(దిగువ ప్రధాన కాలువ) ద్వారా కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలకు నీరు అందుతుంది. హెచ్ఎల్‌సి కింద అనంతపురం, కడప జిల్లాల్లో 2.84 లక్షల ఎకరాలు, ఎల్ఎల్‌సి కింద కర్నూలు జిల్లాలో 1.57 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆంధ్రప్రదేశ్ వైపునున్న ఎల్ఎల్‌సికి 24 టిఎంసిలు, హెచ్ఎల్‌సికి 32.50 టిఎంసిలు కేటాయించగా పూడిక కారణంగా తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిలువ సామర్థ్యం తగ్గడంతో ఇప్పుడు ఏటా సగటున దామాషా పద్ధతిలో ఎల్ఎల్‌సికి అందుతున్న నీరు 18 నుంచి 20 టిఎంసిలు, హెచ్ఎల్‌సికి అందుతున్న నీరు 23.50 టిఎంసిల వరకే ఉంటోంది. దీంతో తుంగభద్ర డ్యాముకు ఎగువ భాగంలో కర్నాటక రాష్ట్రం తుంగ, భద్ర నదులపై ప్రత్యేకంగా ప్రాజెక్టులు నిర్మిస్తుండటంతో ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని అభ్యంతరాలూ ఉన్నాయి. అప్పర్ భద్ర ప్రాజెక్టును 29.75 టిఎంసిల సామర్థ్యంతో కర్నాటక రాష్ట్ర ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఇది పూర్తయితే సుమారు 30 టిఎంసిల నీరు ముందు భద్రలో నిలువ అయిన తరువాత తుంగభద్ర డ్యామ్‌లోకి వస్తాయి. వర్షాభావ



పరిస్థితులు నెలకొని వర్షాలు ఆలస్యమైన సమయంలో ప్రాజెక్టులోకి నీరు రావడం ఆలస్యమయితే ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి ఆయకట్టుకు సరైన సమయంలో నీరు అందే అవకాశం లేకుండా పోతుంది. దీంతో పాటు తుంగభద్ర నదిపై కర్నూలు జిల్లాలో నిర్మించిన సుంకేసుల బ్యారేజి నుంచి కర్నూలు, కడప (కెసి) కెనాల్ కర్నూలు నగరం మీదుగా కడప వరకూ నీరందిస్తుంది. దీని కింద 1.10లక్షల ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. తుంగభద్ర నుంచి నీటి విడుదల ఆలస్యం అయితే కెసి కెనాల్‌కు కూడా పూర్తి స్థాయిలో నీరందకుండా పోయే ప్రమాదం ఉంది. కరువు జిల్లాలైన కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీటిని అందించే తుంగభద్ర నుంచి నీటి విడుదల ఆలస్యం అయ్యేలా అప్పర్‌భద్రకు నిధులు కేటాయించడం పట్ల వామపక్షాలు, రైతు సంఘాలు, పలు పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అప్పర్‌భద్రకు కేటాయించిన నిధులను వెనక్కి తీసుకోవాలని, రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. రాయల సీమను ఎడారి కాకుండా కాపాడుకోవాలని, నిరసన కార్యక్రమంలో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి గురుస్వామి

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి గురు స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగరంలోని కార్మిక, కర్షక భవన్‌లో ఆ సంఘం కోకన్వీనర్ శివప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురు స్వామి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. వార్డు గ్రామ సచివాలయ శాఖను సేవా దృక్పథంతో పని చేసే పద్ధతి కాకుండా టార్గెట్ ఓరియెంటెడ్‌గా మార్చుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో వార్డు గ్రామ సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జాబ్ చార్ట్ లేనందున కొన్ని క్యాడర్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని, విధి నిర్వహణలో ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. కొంతమంది చనిపోతున్నారని అన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశం జనవరి 29న విజయవాడలో జరిగిందని, సమావేశంలో చేసిన నిర్ణయాల అమలుకు అందరూ కృషి చేయాలని కోరారు. జిల్లాలకు బాధ్యులను నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా మార్చి నెల ఆఖరిలోపు 26 నూతన జిల్లాలకు కమిటీలు వేయాలన్నారు. రిప్రజెంటేషన్ టీంగా కె.అనురాధ, ఎం.గురుస్వామి, కె.అన్నమ్మ, డిఎం.సుభాని, సత్యలు ఉంటారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల నాయకులు ఎమ్‌డి.అంజి బాబు, కమిటీ సభ్యులు వెంకట్రాముడు, కిరణ్ కుమార్, అబ్దుల్ బాష, సూర్య కుమార్, పట్టాభి, తిమ్మప్ప పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న గురు స్వామి

యాత్రికుల భద్రతే లక్ష్యంగా సేవలు

- టూరిస్టు పోలీసు స్టేషన్‌లో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చే యాత్రికుల భద్రతే లక్ష్యంగా సేవలు అందుతాయని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీరాఘవేంద్ర స్వామి మఠం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎపి టూరిస్టు పోలీసు స్టేషన్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 13న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, డిజిపి రాజేంద్రనాథరెడ్డి సంయుక్తంగా (వీడియో కాన్ఫరెన్స్) వర్చువల్ విధానంలో పోలీసు అవుట్ పోస్టును ప్రారంభిస్తారని తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు పోలీసు సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి పుంజుకుంటుందని, కరోనా కాల విరామం తర్వాత టూరిస్టు స్పాట్లకు పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తున్నారని తెలిపారు. పండగలు, పర్వదినాలు, సెలవు రోజుల్లో భక్తుల తాకిడి మరింతగా ఉంటోందని పేర్కొన్నారు. వచ్చే వేసవి సెలవులకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలు, బీచ్‌లు, హిల్ స్టేషన్స్, ఆహ్లాదాన్ని పంచే ప్రాంతాలు, ప్రాచీన కట్టడాలు, చారిత్రాత్మక ఆలయాలు ఇతర సందర్శనాత్మక ప్రదేశాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని పర్యాటకులకు సంబంధించి భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. పర్యాటకుల సమస్యలపై వెంటనే స్పందించేలా ఇకపై ఈ టూరిస్టు పోలీసింగ్ విధానం సమర్థవంతంగా అమలు కానుందని చెప్పారు. పోలీసు స్టేషన్లకు అనుసంధానంగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 13న సోమవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వర్చువల్ ద్వారా ప్రారంభిస్తారని తెలిపారు. ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్, మంత్రాలయం సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాలరాజు, మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి 176 జయంతి పురస్కరించుకుని ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి సేవా సమితి, కిమ్స్ హాస్పిటల్ కర్నూలు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 17వ వార్డులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 17 వార్డు ప్రజల నుండి మంచి స్పందన వచ్చింది. ప్రారంభానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, మాంటిస్సోరీ స్కూల్ యజమాని రాజశేఖర్, 17 వార్డు, కార్పొరేటర్ పద్మలత పాల్గొన్నారు. గౌరవాధ్యక్షులు డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యవర్గ సభ్యులు, కాలనీ ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, ఎమెర్జెన్సీ మెడిసిన్ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంవత్సరంలో ఒకసారి ఖచ్చితంగా ఫుల్ బాడీ చెకప్ చేసుకోవాలన్నారు.

సిలికా సాండ్‌గని లీజుకు అనుమతివ్వరాదు : సిపిఎం

21 న కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ :

ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామ సమీపంలో సిలికాసాండ్ గనుల లీజుకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు ఇవ్వవద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 21న కాలుష్య నియంత్రమండలి కార్యాలయం ముందు జరుగు ధర్నాను కేతవరం, కన్నమడకల, కలబందలపాడు ప్రజలు రైతులు జయప్రదం చేయాలని జి.రామకృష్ణ, మండల కార్యదర్శి బి. నాగన్న, కేతవరం శాఖా కార్యదర్శి జి శ్రీధర్ లు కోరారు. ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామంలో 8 వేల సంవత్సరాల క్రితం ఆదిమానవులు సంచరించిన ప్రాంతంగా వారు వేసిన చిత్రాలు, లిపి చరిత్రను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. చేసే కంచె మేసినట్లు ప్రభుత్వమే ఆదిమానవుల సంచరించిన ప్రాంతంలో , విమానాశ్రయం సమీపంలో లీజులు మంజూరు చేయడమేంటని వారు ప్రశ్నించారు. కన్నమడకల, కలవందలపాడు, కేతవరం గ్రామాల చిన్న సన్నకారు రైతులు పంటలు పండిస్తూ జీవనం పొందుతున్నారని తెలిపారు. ఈ పరిశ్రమ వల్ల దుమ్ము వెదజల్లి కాలుష్యంతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో మాజీ సర్పంచి గ్రామ ప్రజలు వ్యతిరేకించినప్పటికీ కాలుష్య నియంత్రణ మండలి లీజుల మంజూరుకు ఆమోదించడం సరైన చర్య కాదన్నారు. అధికారులు స్పందించకపోతే ఈనెల 21 న కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం ముందు ధర్నా చేప డుతామన్నారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

కంటిని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



ప్రతి ఒక్కరూ తమ కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్ ఖాన్ సూచించారు. కర్నూలు నగర 1వ వార్డ్ కార్పొరేటర్ షాషావలి ఆధ్వర్యంలో చిదంబరరావు వీధిలో గల 11ఫోర్ట్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో శాంతిరామ్ లేజర్ కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కార్పొరేటర్ షాషావలితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధ పడుతున్న ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్విని యోగం చేసుకొని కంటి సమస్యలకు తగు వైద్య పరీక్షలు, సలహాలు, సూచనలు ఉచితంగా పొం దాలని చెప్పారు. సుమారుగా వార్డులో ఉన్న 250 మంది ఈ అవ కాశాన్ని వినియోగం చేసు కున్నారని తెలిపారు. స్థానిక వార్డు నాయకులు పాల్గొన్నారు.



గంటసాల వర్ధంతి సభలో మాట్లాడుతున్న పత్తిఓబులయ్య

ఘంటసాల పాటల మాధుర్యం అనిర్వచనీయం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ఘంటసాల పాటల మాధుర్యం అజరామరమని టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తిఓబులయ్య అన్నారు. శతాబ్ది గాయకుడు ఘంటసాల వర్ధంతి సభను టిజివి కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల నాటకాన్ని కళాకారులు ప్రదర్శించారని తెలిపారు. ఈ నాటకాన్ని హైదరాబాద్ కు చెందిన భాస్కరుని సత్య జగదీష్ రచన చేసి దర్శకత్వం వహించారు. సాయి సంతోషి సురభి నాట్యమండలికి చెందిన సురభి కళాకారులు 40 మంది ఇందులో వివిధ పాత్రలను ధరించారు. ఘంటసాల జీవితం పై వచ్చిన మొదటి నాటకం ఇదేనని వక్తలు కొనాయాడారు. సభలో కళాకారులు మహమ్మద్ మియా, చంద్రకంటిమద్దయ్య తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సిద్దేశ్వరం దగ్గర బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించాలి

ఎగువ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణం నిలిపివేయాలి
ఒకే రోజు 52 మంది ఎమ్మెల్యేలు, 8మంది ఎంపీ లకు వినతి పత్రాలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కేంద్ర ప్రభుత్వం కృష్ణానదిపై నిర్మించ తలపెట్టిన ఐకానిక్ వంతెన వల్ల రాయలసీమ కరువు తీరదని, బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం చేస్తే రాయలసీమ ప్రాంత ప్రజల అభివృద్ధి సాధ్యం అవుతుందని డిమాండ్ చేస్తూ రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆదివారం రాయలసీమ జిల్లాలోని ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఎంపీ, ఎమ్మెల్యేలను కలసిన స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖరరెడ్డి పిలుపు మేరకు రాయలసీమలోని 52 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలకు వినతి పత్రం ఇచ్చారు. కర్నూలు, నంద్యాల ఎంపీలు డాక్టర్ సంజీవ్ కుమార్ , పోచ బ్రహ్మానంద రెడ్డి ,కర్నూలు, నంద్యాల జిల్లాల ఎమ్మెల్యే హఫిజ్ ఖాన్, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, శిల్ప చక్రపాణి రెడ్డి తదితరులకు వినతి పత్రాలు రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు సీమ కృష్ణ, రవికుమార్, వేముల శ్రీధర్, నాగేశ్వరరావు, రమణారెడ్డి, సుబ్బారాయుడు, సురేష్, నిమ్మకాయల కబీర్, పసుపల మురళి, క్రాంతి నాయుడు, అందించారు. రాయలసీమ ప్రాంతం అభివృద్ధికోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సిద్దేశ్వరం దగ్గర బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం జరిగితే దాదాపుగా 60 నుంచి 70 టిఎంసిల నీరు నిల్వ చేసుకోవచ్చని అన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రంలో ఎగువ భద్రపై నిర్మించ తలపెట్టిన ప్రాజెక్ట్ నిర్మాణాన్ని నిలిపేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఎగువ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణం జరిగితే నికర జలాలు రాక రాయలసీమకు ఉరి తాడు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు ప్రధాన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్ళి రాయలసీమ అభివద్ధికి సహకరించాలని కోరారు.



నంద్యాల ఎంపికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు



కర్నూలు ఎంపికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు



కర్నూలు ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు



వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపుదాం : టిడిపి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలం బిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఇంటికి సాగనంపుదామని టిడిపి మండల అధ్యక్షులు రామాం జనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. రామాంజనేయులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇసుక మాఫియా, కరెంటు బిల్లులు నిత్యావసర సరుకులు, నిరుద్యోగ యువత , విదేశీ విద్యను దూరం చేయడం మాట నిలబెట్టుకోలేని ముఖ్యమంత్రిని జగన్మోహన్ రెడ్డిని చూస్తున్నాం అన్నారు. పార్టీ ఇచ్చిన అభిప్రాయ సేకరణ పత్రాలలో వివరములు సేకరించి ఫోన్ నెంబర్ 9261292612కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. గ్రామ సర్పంచిపద్మావతి, మాజీ ఎంపిపి బాల వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపిటిసి యాగంటయ్య పాల్గొన్నారు.



చెత్తకుప్పలో జగనన్న విద్యా కానుక

-నాణ్యతలేక పుస్తకాల బరువుకు చిరిగిన బ్యాగులు
-పారేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -సి బెళగల్ : మండలంలో ప్రతి ఊర్లో చెత్త కుప్పలలో జగనన్న విద్యాకానుక బ్యాగులు దర్శనమిస్తున్నాయి. మండలంలో 45 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ప్రభుత్వం సుమారు పదివేలకు పైనే ఈ బ్యాగులను విద్యార్థులకు ఉచితంగా పంపిణి చేసింది. అయితే పంపిణీ సమయంలో మాత్రం నాణ్యతగలవని, ఏ ప్రభుత్వం చేయని విధంగా బ్యాగులు పంపిణి చేసిందని ప్రగల్బాలు పలికింది. తీరా చూస్తే నాణ్యత డొల్ల తనానికి పుస్తకాల బరువుకు అవి మన్నిక రాక, చిరిగి పోతుంటే ఉపయోగం లేదని చెత్త కుప్పలో పడేయక తప్పలేదని విద్యార్థులు వాపోయారు. ఇలా ప్రతి గ్రామంలో దర్శనమిస్తుండటం గమనార్హం.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

స్వచ్ఛ భారత్ కార్మికులకు వేతనాలు పెంచాలని ధర్నా

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి-ఆలూరు

గ్రీన్ అంబాసిడర్స్ స్వచ్ఛ భారత్ కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం జిల్లావ్యాప్తంగా మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, వార్డుల్లో స్వచ్ఛభారత్ కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకొంటూ వేతనాలను పెండింగులో ఉంచి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. రాజకీయ వేధింపులు ఆపాలని, కార్మికులకు ఇచ్చిన రిక్షాలు పంక్షర్, మరమ్మతుల ఖర్చులకు కూడా కార్మికులు పెట్టుకోవాల్సి వస్తుందని చెప్పారు. 2022 జనవరి నెల నుంచి కార్మికులకు రూ.10 వేలు వేతనం పెంచుతామని కేంద్రం హామీఇచ్చిందని, ఇంతవరకు ఆ ఊసే లేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వేతనాలు పెంచి ప్రతి నెలా వేతనాలు సక్రమంగా ఇవ్వాలని మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 20న కలెక్టరేట్ ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు కెపి.నారాయణస్వామి, షాకీర్, కృష్ణ, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా పాల్గొన్నారు.

కేసులతో లోకేష్ యాత్రను అడ్డుకోలేరు

- కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


మాట్లాడుతున్న కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం పాదయాత్ర'కు ప్రజలే దళంగా మారి అండగా ఉంటున్నారని, మైక్‌ను లాక్కున్నంత మాత్రాన లోకేష్ గొంతును నొక్కేయలేరని, కేసులతో పాదయాత్రను అడ్డుకోలేరని కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో ఓ వివాహ వేడుకకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోకేష్ పాదయాత్రకు జగన్ సర్కారు అడుగడుగునా అడ్డంకులు, అవరోధాలు సృష్టిస్తూ తప్పుడు కేసులు బనాయిస్తోందని తెలిపారు. లోకేష్ పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణను చూసి వైసిపి ప్రభుత్వానికి చెమటలు పడుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో నీళ్ల, నిధులు, నియామకాలకు మంగళం పాడి దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యపట్టారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణం, ఎల్ఎల్‌సి అండర్ గ్రౌండ్ పైపులైన్ ప్రాజెక్టుల పనులను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో పసుపు జెండా ఎగరవేయడం తథ్యమన్నారు. టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, ముగతి వీరా రెడ్డి, ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, ఎన్‌టిఆర్, ఎన్‌బికె ఫ్యాన్స్ సేవా సమితి అధ్యక్షులు రోజా ఆర్ఫ్ ఉసేని, అల్వాల లక్ష్మన్న, ఆఫ్ఘాన్ వలీ బాష ఉన్నారు.

జీతాలు ఇవ్వని స్థితిలో ఎపి

- కేంద్ర మంత్రి దేవు సిన్హా చౌహాన్

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగులకు సక్రమంగా జీతాలు ఇవ్వలేని స్థితిలో ఎపిలో పాలన కొనసాగుతోందని, ఇది పాలకుల వైఫల్యమేనని కేంద్ర ఐటి శాఖ మంత్రి దేవు సిన్హా చౌహాన్ దుయ్యబట్టారు. ఆదివారం రాత్రి ఆదోనిలోని వాసవీ కల్యాణ మండపంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు విట్టా రమేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎపికి కేంద్ర బడ్జెట్‌లో రూ.42 వేల కోట్ల నిధులిచ్చామని, లేదని చెప్పడం భావ్యం కాదని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, పార్థసారథి, జిల్లా అధ్యక్షులు పోలంకి శ్రీరాములు, దేవేంద్ర, నాగరాజ్, సావిత్రి, మలేకర్ శ్రీనివాసులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి

జగనన్న ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ఎంత..?

- స్థల సేకరణలోనే అవకతవకలు - నత్తనడకన నిర్మాణాలు...

ప్రజాశక్తి - ఆదోని

సొంతింటి కల సాకారం చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించడంతో పేదల్లో ఆశలు చిగురించాయి. జగనన్న కాలనీల నిర్మాణం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, స్థలాలు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం చేపడతామని ముఖ్యమంత్రి కాగానే జగన్మోహన్‌రెడ్డి చెప్పడంతో లబ్ధిదారులు సంబరపడ్డారు.


జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

స్థల సేకరణలోనే అవకతవకలు

పట్టణ శివారులో కాకుండా దూరపు ప్రాంతాల్లో స్థల సేకరణ చేపట్టారు. సుమారు 10 వేల మంది లబ్ధిదారులకు సరిపడే సెంటు స్థలం కోసం అధికారులు సేకరించారు. పట్టణానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేస్తుండడం, అందులోనూ కేవలం సెంటు విస్తీర్ణం మాత్రం ఇస్తుండడంతో లబ్ధిదారులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రభుత్వం నుంచి ఎక్కువ మంజూరు చేసి కొందరు జేబులు నింపుకుంటున్నట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. సబ్ కలెక్టర్ స్థాయి అధికారి సైతం విచారణ జరిపిన సందర్భం ఉంది.

నత్తనడకన నిర్మాణాలు

జగనన్న కాలనీలో లబ్ధిదారులకు మొదటి విడతగా 5 వేలకు పైగా ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టారు. సంబంధిత జెఎన్‌ఆర్ కాంట్రాక్టర్ నిర్మాణాలు చేపడుతున్నట్లు, అందుకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. ఇప్పటికీ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి.

అవకతవకలకు ఆజ్యం

అధికారులు, నాయకులు, గుత్తేదారుల వల్ల జగనన్న ఇళ్ల నిర్మాణాల పురోగతి అటుంచితే నాణ్యతకు తూట్లు పొడిచినట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం 484 కిలోల ఇనుము, 90 బస్తాల సిమెంటు అందిస్తోంది. అందులో కూడా కోతలు విధిస్తున్నారని పలువురు చెబుతున్నారు. అందులో కొసరు తీసి వారి సొంత ఖజానా నింపుకోవడానికి మూడు సిమెంటు బస్తాలు, ఆరు కడ్డీలుగా గుత్తేదారులు నిర్మాణం చేపట్టి ప్రతి పేదవాడికీ సొంత గూడు అన్న ఆశయాలకు, ఆలోచనలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇళ్ల నిర్మాణంలో ఫ్లింత్ భీమ్ వరకే కడ్డీలతో పనులు చేయిస్తున్నారు. ఇదేంటి పైకప్పు వరకు పిల్లర్లు తీసుకొచ్చి శ్లాబ్ వేయాలి కదా అని అడిగే అధికారులే కరువయ్యారా అని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. భూమి లెవెల్ మీద ఫ్లింత్ భీమ్ 9 ఇంచుల వరకు కడ్డీలు తప్పితే, తర్వాత నేరుగా పైకప్పు (శ్లాబ్)కు మాత్రమే గుత్తేదారులు ఇనుము వాడతారని స్పష్టంగా తెలుస్తోంది. అధికారులు, పాలకుల కళ్ల ముందే నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి నిర్మాణ పనులు చేపడుతున్నా ఏ ఒక్కరూ మాట్లాడకపోవడం విమర్శలకు తావిస్తోంది. బిల్లులు ఆమోద పరిచి ఉన్నతాధికారులకు, నాయకులకు కాంతి చిత్రాల ద్వారా సమాచారం పంపిస్తూ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని గొప్పలు చెప్పుకుంటున్నారు. బేస్‌మెంట్ లెవెల్ మూడు అడుగులు, పైకప్పు వరకు 10 అడుగులు సుమారు దాదాపు 13 అడుగులు ఇనుము లేకుండా ఇళ్ల నిర్మాణం చేపడితే ఆ నిర్మాణం నిలబడుతుందా అనే సందేహాలు లబ్ధిదారుల్లో నెలకొన్నాయి. వాతావరణంలో మార్పు చెంది ఓ మోస్తరు వర్షం కురిస్తే నిలకడగా ఉండగలదా? అని ఏ అధికారికి , లేదా పాలకులకు తెలియకపోడవడం శోచనీయం. వారానికో, నెలకోసారో పైనుంచి కింద వరకు, సమీక్షలు, పురోగతి కార్యక్రమాలు చేపడుతున్నా జగనన్న కాలనీల నిర్మాణం అధోగతి పాలైంది. లబ్ధిదారులకు ఇంత నాసిరకమైన ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి కొందరి చేతివాటానికైనా నిదర్శనం... అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యం... కాంట్రాక్టర్‌కు పలుకుబడి కలిగి ఉండడంతో అధికారులు నోరెత్తని పరిస్థితి నెలకొంది.

అదనపు రుణం

లబ్ధిదారులు పొదుపు గ్రూపుల్లో సభ్యురాలిగా ఉంటే వారికి రూ.30 వేలు రుణం ఇప్పిస్తున్నారు. జగనన్న కాలనీకి సంబంధించిన లబ్ధిదారులందరి బ్యాంకు అకౌంట్లు ఐసిఐసిఐ బ్యాంకులోనే 'సునా' ఖాతాలు తెరిపించడంలో ఆంతర్యం ఏమిటన్నది ఓ అంతుచిక్కని ప్రశ్న. అధికారులు, గుత్తేదారుడే నిజంగానే గాల్లో మేడలు కట్టించేశారని వాపోతున్నారు. అధికారుల, పాలకుల చేతివాటానికో, లేక నిర్లక్ష్యం వల్లనో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోతుందేమోనని ప్రభుత్వ పనితీరు పట్ల లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు ప్రజాధనంతో నిర్మిస్తున్న జగనన్న కాలనీపై దృష్టి సారించి మొదటి దశలోనే ఉన్న ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో నిర్మించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అధికారులు నిష్పక్ష పాతంగా వ్యవహరించాలి

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి, ఆదోని



జగనన్న కాలనీ ఇంటి నిర్మాణంలో నిబంధనలు పాటించాలి. నాసిరకంగా నిర్మిస్తే పేదలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే జగనన్న ఇళ్ల నిర్మాణం పట్ల లబ్ధిదారుల్లో అయోమయం నెలకొని ఉంది. సొంతింటి కల సాకారం చేస్తామని చెప్పుకుంటున్న పాలకులు నిజాయితీగా వ్యవహరించి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి. త్వరలోనే లబ్ధిదారులతో కలిసి జగనన్న కాలనీని సందర్శించి అక్కడ జరుగుతున్న లోపాలను గమనించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

15 నుంచి వర బండే గురువుల జాతర

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని పూలచింత గ్రామంలో వెలిసిన సద్గురు శ్రీవర బండే గురు స్వామి 117వ జాతర మహోత్సవం 15 నుంచి 17 వరకు జరగనున్నాయి. స్వామి వారి మఠాలను ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల్లో శ్రీవరబండే గురు స్వామి పేరుపై ఏర్పాటు చేశారు. ఈ నెల 15 నుంచి 17 వరకు శ్రీ వరబండే గురు స్వాముల ఉత్సవాలకు పీఠాధిపతులు జయ శంకర స్వామి ఆధ్వర్యంలో ఉప పీఠాధిపతి శ్రీమఠం బండే గురు స్వామి సమక్షంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. 15న ఉదయం స్వామి వారికి ఆకు పూజ, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, తులసి పూజా తదితర పూజలు, సాయంత్రం మహా రథోత్సవాన్ని నిర్వహిస్తారు. రథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. అనంతరం స్వామి వారి దేవాలయం పక్కనే భక్తులకు బస చేసేందుకు వసతితో పాటు, 5 రోజుల పాటు అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. గతేడాది కాశీ నుంచి తెచ్చిన శివలింగం మఠంలో ప్రత్యేకత సంచరించుకుంది. జాతర సందర్భంగా గ్రామంలో దేవాలయంలో భజన పోటీలు, క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు.

నేటి నుంచి కరివేములలో ఉరుసు ఉత్సవాలు..

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కరివేముల గ్రామంలో సోమవారం నుంచి వన్నూరు వలీ స్వామి ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, గ్రామస్తులు ఆదివారం తెలిపారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలూ లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు, బుధవారం జియారత్ వంటి కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. దర్గాను విద్యుద్దీపాలతో, రంగులతో అలంకరించారు.

పోతుల నాగరాజును గెలిపించాలి

- ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న పోతుల నాగరాజును గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. పోతుల నాగరాజు ఉపాధ్యాయ ఉద్యోగానికి విఆర్ఎస్ ఇచ్చి ప్రజా ఉద్యమాలకు అంకితమయ్యారని తెలిపారు. అలాంటి మంచి వ్యక్తులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. కార్మికులు, కర్షకుల సమస్యలు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం శాసనమండలిలో పోరాడే వ్యక్తి అని తెలిపారు. ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీలు డబ్బులతో అందరినీ కొనుక్కొని ఎన్నికల్లో గెలవాలని తాపత్రయపడుతున్నాయని చెప్పారు. దీనికి అడ్డుకట్టు వేసి నీతి, నిజాయితీ కోసం పాటుపడే అభ్యర్థి పోతుల నాగరాజుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సిఐటియు మండల కార్యదర్శి బి.వీరారెడ్డి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఉచ్చీరప్ప, కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప, వ్యకాస నాయకులు విరుపాక్షి, డివైఎఫ్ఐ నాయకులు రామాంజనేయులు, వీరేష్, చిరంజీవి, కెవిపిఎస్ నాయకులు రామాంజనేయులు, సిద్ధప్ప, పరమేష్ పాల్గొన్నారు.


గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు


సిఐ శ్రీరామ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న యాజమాన్యం

ఆకట్టుకున్న 'డుం డుం దిగాదిగా'

ప్రజాశక్తి - ఆదోని


'డుం డుం దిగా దిగా' పేరిట భాష్యం రెండో బ్రాంచి వేదికపై ఆదివారం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 'బుట్ట బొమ్మ... పుష్ప, బాపూజీ స్టైయిల్, వాల్తేరు వీరయ్య, మాస్ మహారాజా స్టెప్పులు చూపరులను ఆకట్టుకున్నాయి. 'ఔరా' అనిపించే విధంగా ఆకట్టుకున్న స్టెప్పులు, 'రాను రాను అంటూనే చిన్నదో' పాటలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపిందని ప్రిన్సిపల్ సదాశివ తెలిపారు. భాష్యం రెండో బ్రాంచికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మూడో పట్టణ సిఐ శ్రీరామ్ మాట్లాడుతూ... వినడం, మాట్లాడడంతో పాటు దృశ్య రూపం ద్వారా విద్యార్థుల్లో మానసికోల్లాసం పెరుగుతోందని తెలిపారు. జెడిఒ అనిల్ కుమార్ మాట్లాడుతూ... చదువు, క్రీడలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందని చెప్పారు. భాష్యం విద్యాసంస్థల డివిజనల్ ఇన్‌ఛార్జీ రవివర్మ, వైస్ ప్రిన్సిపల్ అంజి, ప్రధానోపాధ్యాయులు వాణి ఉన్నారు.

విద్యుదాఘాతంతో చెరకు పంట దగ్ధం

-రూ.3 లక్షలు నష్టం

ప్రజాశక్తి - కౌతాళం

విద్యుదాఘాతానికి గురై చెరకు పంట దగ్ధమై రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిన సంఘటన మండలంలోని కామవరం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. తలారి నరసింహులు తన సొంత పొలం ఒకటిన్నర ఎకరాల్లో చెరకు పంటను సాగు చేశారు. మరో ఒకటిన్నర ఎకరాలు కౌలుకు తీసుకుని చెరకు సాగు చేశారు. పంట చేతికి రావడంతో కోత దశలు ఉండగా పొలంలో ఉన్న విద్యుత్ ద్వారా మంటలు వ్యాపించడంతో మూడెకరాలు చెరకు పంట మొత్తం దగ్ధమైంది. సుమారు రూ.3 లక్షలకు పైగానే నష్టం వాటిల్లినట్లు రైతు తలారి నరసింహులు వాపోయారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ఆలూరు



దూద్ పీర్ (ఫైల్)

ఆలూరు మండలం హులేబీడు గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన దూద్ పీర్ (26) మృతి చెందారు. మరో యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... హులేబీడుకు చెందిన దూద్ పీర్ ఆదోనిలో చిన్నపాటి బట్టల దుకాణం నిర్వహిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన చిన్న మోహిద్దీన్‌తో కలిసి వారి ద్విచక్ర వాహనంలో గ్రామానికి బయల్దేరారు. గ్రామ సమీపంలో ఒక్కసారిగా మేక రోడ్డుకు అడ్డంగా రావడంతో మేకను తప్పించబోయి అదుపు తప్పడంతో వెనుకాలే ఉన్న మోహిద్దీన్ ద్విచక్ర వాహన ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. తలకు బలమైన దెబ్బ తగలడంతో దూద్ పీర్ అక్కడిక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మోహిద్దీన్‌ను ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి వైద్యులు రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రచురణ

- ఎంపిడిఒ సుధాకర్ రాజు

ప్రజాశక్తి - చిప్పగిరి



ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా స్థానిక సంస్థల ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేస్తున్నట్లు ఎంపిడిఒ సుధాకర్ రాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి ఎంపిటిసి, జడ్‌పిటిసి సభ్యులు కలిగిన జాబితాను జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రచురించినట్లు తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫార్మ్-17లో వివరాలు నింపి మండల కార్యాలయానికి లేదా రిటర్నింగ్ అధికారికి, జెసికి అందజేయాలని చెప్పారు. జాబితా వివరాల కోసం మండల పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

నిత్య జీవితంలో సైన్స్ కీలకం

- జెవివి జిల్లా అధ్యక్షులు శంకరయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సైన్స్ మానవ జీవితంతో నిత్యం ముడిపడి ఉంటుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.శంకరయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, ముగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవరావు, ప్రధానోపాధ్యాయులు మాదన్న తెలిపారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో ఛార్లెస్ డార్విన్ జయంతి సందర్భంగా 'జీవపరిణామం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముందుగా ఛార్లెస్ డార్విన్ చిత్రపటానికి పూలమాల నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఛార్లెస్ డార్విన్ జయంతి జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. విజ్ఞాన శాస్త్రానికి వన్నెతెచ్చిన, విజ్ఞాన శాస్త్రాన్ని మలుపు తిప్పిన శాస్త్రజ్ఞుడు ఛార్లెస్ డార్విన్ జయంతి జరపడం భవిష్యత్ తరాలకు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేటట్లు చేస్తుందని చెప్పారు. సైన్స్ మానవ జీవితంలో ప్రతి కోణాన్ని శాసిస్తుందని, సైన్స్ అనువర్తితం లేని మానవ జీవితాన్ని ఊహించలేని పరిస్థితుల్లో ఉన్నామని తెలిపారు. జెవివి నాయకులు శివ కుమార్ 'దయ్యాలు లేవని విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఒక చిన్న మ్యాజిక్ షో ప్రదర్శించారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకొని పరిశీలన, ప్రశ్నించేతత్వం, ప్రయోగాల, సృజనాత్మక ఆలోచనల వల్ల నేటి బాలలు భవిష్యత్తు ఆవిష్కర్తలుగా ఎదగాలని కోరారు. సైన్స్‌ను సామాన్యుల దగ్గరకు చేర్చినప్పుడే గ్రామాల్లో ఉన్న పేదరిక, సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపవచ్చని కోరారు. అనంతరం మండలంలో కొన్ని నెలల క్రితం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల, పాఠశాల విజేతలకు ముఖ్య అతిథులు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం, జెవివి నాయకులు నారాయణ, ఖాదర్, ప్రసాద్, కిరణ్ కుమార్, యుటిఎఫ్ నాయకులు బాబు చేతులమీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎల్లప్ప వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. యుటిఎఫ్ నాయకులు రాఘవేంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.


బహుమతులు పంపిణీ చేస్తున్న నాయకులు


ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీతారామిరెడ్డి

హరిసర్వోత్తమ రైస్ మిల్లు ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన హరిసర్వోత్తమ రైస్, దాల్ మిల్లు ప్రారంభోత్సవలో ప్రముఖులు పాల్గొన్నారు. ఆదివారం స్థానిక సుధారా వాటర్ ప్లాంట్ వెనుక భాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీరప్పాచారికి చెందిన మిల్లును పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, వైసిపి నాయకులు, ఎమ్మిగనూర్ ఆర్‌టిసి డిపో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.సీతారామిరెడ్డి వేర్వేరుగా రైస్ మిల్లు చేరుకున్నారు. వీరప్పాచారి శాలువా, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు మిషన్లను నొక్కి ప్రారంభించారు.

సిద్ధేశ్వరం వద్ద రోడ్డు, బ్యారేజ్ నిర్మించాలి

- ఎమ్మెల్యేకు ఆర్‌సిసి వినతి

ప్రజాశక్తి - ఆదోని

సిద్ధేశ్వరం వద్ద ఐకాన్ బ్రిడ్జికి బదులు రోడ్డు, బ్యారేజ్ నిర్మించాలని రాయలసీమ కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఆర్‌సిసి రాష్ట్ర నాయకులు రవి వర్మ, అనిల్, రామాంజి, శాంతరాజు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం

- నాగరాజు గౌడ్


దేవసుందర్‌ను పరామర్శిస్తున్న నాగరాజు గౌడ్

ప్రజాశక్తి - కౌతాళం

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజు గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఉరుకుంద గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలోని రెండో వార్డ్ మెంబర్ దేవ సుందర్‌ను పరామర్శించారు. దేవ సుందర్ పక్షవాతానికి గురి కావడంతో సమాచారం తెలుసుకుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎల్లవేళలా కుటుంబానికి పార్టీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ నాయకులు పాల్గొన్నారు.

'దళితుల నిధులు దళితులకే కేటాయించాలి'

ప్రజాశక్తి - ఆదోని

దళితులకు కేటాయించిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వారికే కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుదాస్ కోరారు. ఆదివారం రెవెన్యూ భవనంలో డిహెచ్‌పిఎస్ నియోజకవర్గ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి వీరేశ్ అధ్యక్షతన జరిగింది. డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శి సుదర్శన్, బసాపురం గోపాల్, నియోజకవర్గ కార్యదర్శి కుమార్ స్వామి, జిల్లా సభ్యులు విజయ్, నాయకులు భీమేష్, భాస్కర్, మనీ ప్రదీప్, రమేష్, తిరుపాల్, నరసప్ప, పుష్పరాజ్, ఈరన్న పాల్గొన్నారు.

శ్రీశైలం పాదయాత్ర భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ మహేంద్ర ట్రాక్టర్ షోరూమ్ వద్ద శ్రీశైలం వెళ్లే పాదయాత్ర భక్తులకు గత 8 రోజులుగా అన్నదానం కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు అల్కూరి మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి తెలిపారు. ఆదివారం హాలహర్వి మండలం జంగమునూరు హసల్వి ఆజాతు శంభు లింగ శివాచారులు స్వాములు అన్నదాన కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ స్వామి మాట్లాడారు. గత 9 ఏళ్లుగా దాతల సహకారంతో ఈ అన్నదాన్ని కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 13 వరకు అన్నదానం కొనసాగుతుందని చెప్పారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

చట్టసభల్లో వాణిని వినిపించే వారిని ఎన్నుకోవాలి

- ఎమ్మెల్సీ బిటిని కోరిన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని


ఎమ్మెల్సీ బిటి.నాయుడుకు కరపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యలపై చట్టసభల్లో వాణిని వినిపించే వారిని ఎన్నుకోవాలని సిఐటియు నాయకులు లక్ష్మన్న, తిప్పన్న కోరారు. ఆదివారం పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహా రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఎంఐజి, ఎల్ఐజి ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. నాయకులు సుదర్శన్, నాగరాజు, షాబీర్ బాష, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జిల్లాలో రైతుల పండించిన టమోటా పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎన్నో ఏళ్ల నుంచి రాజకీయ నాయకులు వాగ్దానం చేసిన పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ తక్షణమే ఏర్పాటు చేయాలని రైతుసంఘం నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని సర్కిల్‌లో టమోటా పండ్లను పారబోసి ధర్నా చేపట్టారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సత్తన్న అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పంపన్న గౌడ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, రైతు సంఘం తాలూకా కార్యదర్శి జబ్బర్ మాట్లాడారు. జిల్లాలో 50 వేల ఎకరాల్లో టమోటాను సాగు చేశారని తెలిపారు. ఎకరాకు రూ.40 వేల పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. పంట చేతికొచ్చిన నాటికి కనీస ధర కూడా లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. టమోటా మార్కెట్లో దళారీ వ్యవస్థను రద్దు చేయాలని కోరారు. సిపిఐ కార్యదర్శి జి.రంగన్న, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, పట్టణ సహాయ కార్యదర్శి బాలరాజు, సమీవుల్లా, రాజీవ్, రైతు సంఘం నాయకులు బజారి, మల్లికార్జున గౌడ్, సుంకన్న, నరసింహులు, మాబాష, రసూల్, హనీఫ్, నరసింహ, మాబాష, మాలిక్, వీరేంద్ర పాల్గొన్నారు.

పుస్తక నిక్షిప్త కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - హొళగుంద


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి నాగప్ప

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి ప్రకాష్ ఆదేశాల మేరకు హొళగుందలోని కోగిలతోట గ్రామంలో పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని ప్రారంభించారు. ఆదివారం జడ్‌పి వైస్ ఛైర్మన్ కురుబ బొజ్జమ్మ, సర్పంచి నాగప్పలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల కోకన్వీనర్ వీరేష్, పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకులు ఎస్.నాగరాజు పాల్గొన్నారు. కోగిలతోట గ్రామంలో పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు కోరారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరునికి పూజలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని వెంకటసాయి దేవాలయంలో వెలసిన శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి వారికి అభిషేకం, తదితర పూజలను గురుస్వామి భవాని శంకర్ అధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం శివ భక్తులు శివాలయంలో కాశీవిశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకునే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.






పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కిలన్‌ను ప్రారంభిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన, చిత్రంలో నాయకులు తదితరులు

వీధికోక 'ఎన్నిక'ల గృహ రథ సారథి

ప్రజాశక్తి - నందికొట్కూరు

అధికార వైసిపి అప్పుడే ఎన్నికలకు సర్వం సిద్ధమవుతోంది. గతేడాది నుంచి గడపగడపకు కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. అది ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే ఈ కార్యక్రమం అంతగా ఫలితాలు ఇస్తున్నట్టు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మరింత లోతుగా ప్రజలకు చేరవయ్యేందుకు సన్నద్ధమైంది. పట్టణాలలో 100 కుటుంబాలకు ఒక వాలంటీరు, గ్రామాలలో 50 ఇళ్లకు ఒకరు చొప్పున ఉన్నారు. వీరి ద్వారా సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అయితే ఎన్నికలలో వాలంటీర్లను హైకోర్టు ఉత్తర్వులతో పక్కన బెడితే ఏమవుతు ందో గుబులో ఏమో గాని, వారికి అనుబంధంగా మరికొంత మందిని నియమించే ప్రక్రియను అధికార వైసిపి చేపడుతోంది. అది వాలంటీర్ల ద్వారానే చేపడుతోంది. ప్రతి వీధికి ఒక గృహ రథసారథి పేరుతో నియమాకాలను చేపడుతున్నారు. ఇప్పటికే వార్డుకు ఒక కన్వీనర్‌ను నియ మించారు. ఇది కాకుండా తాజాగా వీధికి ఒక గృహ సారధిని నియమిస్తు న్నారు. వాలంటీర్లకు ఎన్నికల సంఘం విధుల్లోకి తీసుకోకుండా ఇతర వాటికి వినియోగిస్తే గృహ రథసారధుల ద్వారా ప్రజలకు చేరువయ్యేదుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ రథసారథులు ఎన్నికల వరకు ప్రతి ఇంటి కెళ్ళి ఆయా కుటుంబానికి జరిగిన మేలు



గురించి వివరించాల్సి ఉంటుంది. వారి ద్వారానే ఎన్నికలలో ఓటర్లను ప్రభావితం చేసే ఆలోచనలో నున్నట్టు తెలుస్తోంది. ఈ రకంగా ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో వేలాది మంది గృహ రథసారథులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోంది. రథసారధులను వాలంటీర్ల ద్వారానే గుర్తించి వారి ఆధార్ కార్డులు, పాస్ పోర్టు సైజు ఫోజులు సైతం సేకరిస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేసి ఎన్నికలకు సన్నద్ధమయ్యే పనులను చేపడుతోంది.

ఎన్నికల కోసమేనా..?

ఈ రకంగా పెద్ద ఎత్తున చేపడుతున్న నియామకాలు వచ్చే సార్వత్రిక ఎన్నికలలో దృష్టిలో ఉంచుకొనేనా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికీ వార్డు కన్వీనర్లు, వాలంటీర్లే కాక, మరింత మందిని గృహ రథసారథులు చేపడుతుండటము ఎన్నికల్లో సులభంగా ప్రతి ఓటరును ప్రభావితం చేయడానికేనా అన్నది చర్చ సాగుతోంది. ఇది పూర్తయితే ఎన్నికలకు ఇంత పెద్ద యంత్రాంగం మరే ఇతర పార్టీ వద్ద ఉండే అవకాశం లేదు. సూక్ష్మస్థాయి ప్రతి ఓటరును మొదలుకొని ప్రభావితం చేసేందుకు వీలుగా అధికార పార్టీ కసరత్తు ప్రారంభించినందునే చెప్పాలి. సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల మనుషుల్లో స్థానం ఉందని చెప్పుకునే వైసిపి ఈ రకమైన ప్రణాళికతో ముందుకు పోవడం ఏమిటన్నది కూడా రాజకీయ వర్గాలలో చర్చ సాగుతోంది. ప్రభుత్వం తీసుకుంటున్నచర్యలతో ఉద్యోగులలో కాస్త వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగులు కాకుండా ఇతర సామాజిక తరగతులు, ఇతర వర్గాలకు తమ వైపు బలంగా తిప్పుకోవడంతోపాటు, తమకు అనుకూలమైన వారితో ఓటింగ్ చేయించుకునేందుకు వీలుగా అధికార వైసిపి ఈ రకమైన ఎత్తులు వేస్తున్నట్టు విపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ఇవన్నీ ఏ రకమైన ఫలితాలను అధికార పార్టీకి తెచ్చి పెడతాయన్నది వేచి చూడాల్సి ఉంది.

సిమెంట్ నగర్‌లో ఉపాధి అవకాశాలు అధికం

రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

సిమెంట్ నగర్ వాసులకు, కార్మికులకు ఉపాధి అవకాశాలు అధికం అవుతాయని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సిమెంట్ ఫ్యాక్టరీ పునః ప్రారంభంలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కిల్లన్ను రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఫ్యాక్టరీ చైర్మన్ ఎస్ జగద్రాక్షకన్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. గత ఏడాది నుండి ఫ్యాక్టరీ కార్యకలాపాలు ప్రారంభించినప్పటికీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కిలను ఆర్థిక మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిమెంట్ నగర్ వాసులకు పూర్వ కార్మికులకు ఉపాధి అవకాశాలు అధికమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఆర్థిక మంత్రి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గోరుమాలకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు మూర్తి జావలి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, చంద్రారెడ్డి, మద్దిలేటి స్వామి, చైర్మన్ సీతారామ చంద్రుడు, స్థానిక నాయకులు యాకోబు, మాజీ వైస్ ప్రెసిడెంట్ కాజా హుస్సేన్, చింతల నాగిరెడ్డి, గూని నాగరాజు, కార్మిక నాయకులు కార్మికులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో పెరుగుతున్న భక్తుల రద్దీ

- క్యూలైన్లో భక్తులకు అల్పాహారం - శివ స్వాములకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి - శ్రీశైలం : మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీశైలం క్షేత్రంలో భక్తుల రద్దీ భారీగా పెరుగుతోంది. 11 రోజుల పాటు జరిగే ఈ మహాశివరాత్రి బ్రహ్మో త్సవాలలో స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుండి భక్తులు పాతాళ గంగలో స్థానాలాచరించి స్వామిని దర్శించుకు నేందుకు క్యూలైన్లలో ఉండడం జరుగుతుంది. భక్తుల సౌకర్యార్థం స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు నాలుగు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉచిత, శీఘ్ర ,అతి శీఘ్ర, శివ స్వాములకు ప్రత్యేకలైను ఏర్పాటు చేశారు. వెంకటాపురం బయర్లూటి, నాగలూటీ భీముని కొలను నల్లమల అడవుల్లో పాదయాత్ర వచ్చే యాత్రికులకు ప్రత్యేక కంకణం ధరించిన వారికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్నందున 11వ తేదీ నుండి 21వ తేదీ వరకు అలంకార దర్శనం ఏర్పాటు చేశారు. శివ స్వాములకు 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు నిర్దిష్ట వేళల్లో ప్రత్యేక స్పర్శ దర్శనం ఏర్పాటు చేశారు. క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారంను అందిస్తున్నారు. అన్నపూర్ణ భవనంలో అన్న ప్రసాదం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు సాయంత్రం 6 గంటల నుండి అల్పాహారం అందిస్తున్నారు. ప్రసాదాలు కొనుగోలు చేసేందుకు 15 కౌంటర్లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



పాదయాత్రగా శ్రీశైలంకు వస్తున్న భక్తులు

టూరిస్ట్ పోలీసు సేవా విభాగానికి శ్రీకారం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మహానందిశ్వర స్వామి దేవస్థానం, అహోబిల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన, పర్యాటక ప్రదేశాలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 'ఆంధ్రప్రదేశ్ టూరిస్ట్ పోలీసు' అనే సేవా విభాగానికి నేడు శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి వర్చువల్ ప్రోగ్రాం (వీడియో కాన్ఫరెన్స్ ఆన్ లైన్) ద్వారా ప్రారంభించనున్నారు.ఆంధ్రప్రదేశ్ టూరిస్ట్ పోలీసు అనే సేవ విభాగ అవుట్ పోస్టు సేవలను నంద్యాల జిల్లా ఎస్పీ మహానంది దేవస్థానం నందు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుండి విచ్చేయు భక్తులు, సందర్శకులు, ప్రజల రక్షణ, మార్గనిర్దేశం ఆంధ్రప్రదేశ్ టూరిస్ట్ పోలీసు విధానం ద్వారా ఈవ్ టీజింగ్ ను అరికట్టడం దొంగతనాలు జరగకుండా చూడడం, జరిగిన వెంటనే సంఘటనపై తగిన విధంగా ఫిర్యాదు చేయుటకు ఏర్పాటు చేశారు. దైవ దర్శనానికి వచ్చిన భక్తులకు పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు, భద్రత కల్పించడం, అసాంఘీక కార్యకలాపాలు అడ్డుకట్ట, నేరాల నియంత్రణే లక్ష్యంగా టూరిస్ట్ పోలీస్ ఉండాభోతుంది. దేవాదా య శాఖను సమన్వయము చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించుటకు తోడ్పడను ంది. 24X7 నిరంతరం నిఘా ఉండేలా ఏర్పాటు చేశారు. సందర్శకులు, ప్రజలు వినియోగించుకోనెల ఏర్పాటు చేస్తున్నారు.

కలకత్తాకు బయలుదేరిన వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

ఈనెల 15 నుండి 18 వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తా నగరంలో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత మహాసభలు జరుగుతున్నాయి. ఈ మహాసభలకు నంద్యాల జిల్లా ప్రతినిధులుగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం నాగేశ్వరావు, ఎం సుధాకర్, ట్రెజరర్ ఈశ్వరయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు ఈశ్వరమ్మలు కలకత్తాకు ఆదివారం బయలు దేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిల భారత మహాసభల సందర్భంగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా 14 ,15 తేదీలలో మండల కేంద్రాలలో జెండా ఆవిష్కరణలు చేయాలని పేర్కొన్నారు. ఈ అఖిల భారత మహాసభలలో ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి బడ్జెట్లో 30 వేలకు తగ్గించడం, అలాగే భూ సంస్కరణలు, సంక్షేమ పథకాల కోత, ఆహార భద్రతకు సబ్సిడీ నిధులు తగ్గించడం, వ్యవసాయ రంగానికి బడ్జెట్లో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం పట్ల ఈ మహాసభలో చర్చించి రాబోవు కాలంలో దేశం వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించేందుకు ఈ మహాసభ వేదిక కాబోతుందని అన్నారు.



భారత మహాసభలు కలకత్తాకు బయలుదేరుతున్న నంద్యాల జిల్లా వ్యకాసం ప్రతినిధులు

అగ్ని ప్రమాద బాధితులని పరామర్శించిన ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - ఆత్మకూరు

గ్యాస్ సిలిండర్ పేలి ఆర్థికంగా నష్టపోయిన బాధితులరాలిని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పరామర్శించారు. ఆత్మకూరు పట్టణం వీరభద్ర కాలనీకి చెందిన వీరమ్మ అనే మహిళా తిరునాళ్ల ఉత్సవాల్లో చిన్న పిల్లలు ఆడుకునే బొమ్మల వ్యాపారం చేస్తూ తన జీవనం సాగిస్తుంది. శనివారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం సంభవించడంతో ప్రమాదంలో తన లక్షల రూపాయల సరకు ఇంట్లో సామాన్లు కాలిబూడిద అయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆదివారం నాడు బాధిత కుటుంబానికి పరామర్శించారు. అనంతరం ఆయన బాధితురాలికి రూ.20,000 ఇచ్చి తన వెంబడి వచ్చిన కౌన్సిలర్ విజయ్ చౌదరి. ఎంఎ రషీద్, ఇతర నాయకులతో కలిపి మొత్తం రూ.35000 ఆర్థిక సహాయం చేశారు. ప్రభుత్వం తరుపు నుంచి అన్ని విధాలుగా ఆదుకుంటా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బోయపార్వతి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



బాధితురాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఎన్నికల సంఘం అనుమతితో 13న స్పందన

- జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో వున్న కారణంగా భారత ఎన్నికల సంఘం అనుమతి మేరకు నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ఈ నెల 13వ తేదీ స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయుల, స్థానిక అధికారుల నియోజక వర్గాల ఓటర్లను ప్రభావితం చేసే సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకోబడవని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి ఈనెల 13వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వైసిపి నాయకుడిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని వైసిపి నాయకుడు గోవిందుపై వెలుగోడు ఇంచార్జ్ ఎస్ఐ కృష్ణమూర్తి ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ షాషావలి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ బాధితుడు జాకెటి పెద్ద రమణ వేల్పనూరు గ్రామ నివాసిని, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు, వైఎస్ఆర్సిపి నాయకుడు గోవిందు కులం పేరుతో దూషిస్తూ ఉద్దేశపూర్వకంగా చేయిచేసుకున్నట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ ఫిర్యాదులో ఆత్మకూరు నంద్యాల ప్రధాన రహదారిలో గల గాంధీ నగర్ వేళ్ళు దారిలో వైసిపి నాయకుడు గోవిందుకు సంబంధించిన బాడుగకు ఇవ్వబడు షాపులు ఉన్నాయని తెలిపారు. ఆ షాపులలో వేల్పనూరు గ్రామనివాసి అయినా జాకటి పెద్ద రమణ కుమారుడు వెంకట్ స్టార్ క్లినిక్ అండ్ మెడికల్ నిర్వహిస్తున్నాడని తెలిపారు. వెంకట్ తన సొంత పనుల నిమిత్తం నంద్యాలకు వెళ్ళినప్పుడు అతని తండ్రి అయిన పెద్ద రమణను మెడికల్ షాప్ చూసుకోమని చెప్పి వెళ్లినట్టు బాధితుడు తెలిపారు. ఇదే అదనుగా చూసుకొని వైసిపి నాయకుడు గోవిందు బాడుగ ఇవ్వాలనే నెపంతో కులం పేరుతో దూషిస్తూ ఉద్దేశపూర్వకంగా చేయి చేసుకున్నట్లు ఫిర్యాదులో తెలిపారని అన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు వైసీపీ నాయకుడు గోవిందుపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బాధితుడు జాకటి పెద్ద రమణ

శ్రీశైలంలో జాతీయ స్థాయి నృత్య మహోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానం నందు జాతీయ స్థాయి నృత్య రూపక మహోత్సవాలు ఆదివారం కళారాధనలో నంది నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్ మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాయని సంస్థ అధ్యక్షులు పల్లంశెట్టి సురేష్ తెలిపారు. రాష్ట్రంలో అత్యంత పేరుగాంచిన పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో నంది ఫైనాన్స్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 6వ జాతీయస్థాయి మహాశివరాత్రి పృత్య మహోత్సవాలను వాసవి సత్రం ప్రెసిడెంట్ దేవకి వెంకటేశ్వర్లు, పిఆర్ఓ శ్రీనివాసరావు ప్రారంభించారు. నంది ఫైనాన్స్ సంస్థ అధ్యక్షులు పల్లంశెట్టి సురేష్, నృత్య గురువులు రేణుక ప్రభాకర, నళిని రమణ, ఆచంట చంద్రశేఖర్, శ్రీనివాస వరప్రసాద్, సంధ్యాదేవి, మహేష్ మంద, ఐశ్వర్య రెడ్డి, శ్రీలక్ష్మి, అంగుమన్ గుప్త, ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మణిపురి నాట్య గురు అంగుమన్ గుప్త, పేరిణి నాట్య గురువు అచంట చంద్రశేఖర్, ఒడిసి నాట్య కళాకారిణి అద్వితీయ భట్టాచార్య, మణిపురి డాన్సర్ సంతన్ భాయ్, కథక్ డాన్సర్ రిమిత పాల్, మణిపురి డాన్సర్ అనిందిత మైండిల్, మణిపూర్ డాన్సర్ అంకిత విశ్వాస్, మౌనిత పాల్ ఇంకా ఇతర నృత్య కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవి సత్రం అధ్యక్షులు మాట్లాడుతూ ఈ సంస్థ వారు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు అంతరించిపోకుండా పది కాలాలపాటు గుర్తుండే విధంగా భర్త నాట్యం, కూచిపూడి, జానపదం, మణిపురి, ఆంధ్ర నాట్యం, ఒడిసి, కథక్, పేరిణి మొదలగు నృత్య ఉత్సవాలు నిర్వహించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలో పలు రాష్ట్రాల నుండి దాదాపు 250 మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీశైల దేవస్థానం సహాయ సహకారాలతో నిర్వహించడం జరుగుచున్నదని సంస్థ అధ్యక్షులు పల్లంశెట్టి సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యాంకర్ గాంధీ, భాస్కర్ రెడ్డి, యోగేశ్వర్, కోఆర్డినేటర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న దృశ్యం



మృతిచెందిన బోయ శాంతి షర్మిల

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలోని అనురాధ థియేటర్ సమీపాన నివాసం ఉంటున్న బోయ శాంతి షర్మిలను భర్త మద్దిలేటి ఫోన్లో మందలించాడని ఆదివారం నాడు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బేతంచెర్ల ఏఎస్ఐ లింగమయ్య తెలిపిన వివరాల మేరకు.. భర్త దుబాయిలో పనీ చేస్తున్నాడు. గత నెలలో ఊరికి వచ్చి వెళ్ళాడు. శనివారం రాత్రి భర్త మద్దిలేటి వీడియో కాల్ ఫోన్ చేసి మందలించాడని అందుకని క్షణికావేశంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతురాలికి ఇద్దరు చిన్న కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపిలోకి 30 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణం ఆర్డిటి కాలనీకి చెందిన 30 కుటుంబాలు ఆదివారం సాయంత్రం కాలనీ చెందిన సాదిపాటి శ్రీను ఆధ్వర్యంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ లో చేరాయి. పార్టీలో చేరే వారందరికీ బుడ్డా రాజశేఖర్ రెడ్డి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను తనకు తెలుసునని ప్రధానంగా తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నదని, చీకటి పడితే కాలనీలో వీధిలైట్లు లేక పాములు సంచరిస్తున్నాయని గతంలోనే కాలనీవాసులు తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. వినోద్, గాథ నాగార్జున, వెంకట రమణ, శివ, కంప శ్రీను, హరి నాథ్, గోపాల్, స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరిన ఆర్డిటి కాలనీ ప్రజలు

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బారాయుడు స్వామి నిత్య అన్నదాన పథకానికి దాతలు విరాళాలు అందజేశారు. ఈర్నపాడుకు చెందిన పిట్టం సుధాకర్ రెడ్డి 50 వేల రూపాయలు, పిట్టము తరలిత రెడ్డి, నంద్యాలకు చెందిన ధరణి నాగేంద్ర 10 వేల రూపాయలు, కరిమద్దెల గ్రామానికి చెందిన ఆకుమల్ల బాబు 5 గ్రాముల బంగారం విరాళంగా ఇచ్చారు. అదేవిధంగా మాఘ మాసం సందర్భంగా భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. తలనీలాలు,అభిషేకాలు, అర్చనలతో దేవాలయ పరిసర ప్రాంతం కోలా హలంగా మారింది. భక్తుల దర్శనానికి ఎటువంటి ఆటంకం కలుగకుండా ఇఒ రామకృష్ణ, సిబ్బంది సుబ్బారెడ్డి, పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు.



విరాళం అందిస్తున్న దాతలు

భృంగి వాహనంపై స్వామి అమ్మవార్లు

ప్రజాశక్తి - శ్రీశైలం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో రెండవ రోజున భృంగి వాహనంపై స్వామి అమ్మవార్లు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా స్వామి అమ్మ వార్లకు ఉదయం నుండి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం అక్రమహాదేవి అలంకార మండపంలో స్వామి అమ్మ వాళ్ళ ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి భృంగి వాహనంపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను నృత్య ప్రదర్శనల విద్యుత్ దీపాలు, వేదమంత్రాల మధ్య ఆలయ రాజగోపురం గుండా ప్రధాన వీధిలోకి ప్రవేశింప చేసి అనంతరం ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. నిత్య కళారాదన వేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన, పుష్కరిని వద్ద మహాశివరాత్రి ప్రవచనం, వేణు గానం కూచిపూడి నుండి ప్రదర్శన, శివ దీక్ష శిబిరాలలో ఆంధ్ర నాట్యం బాలనాగమ్మ నాటకం, సాయంత్రం 6 గంటల నుండి ఏర్పాటు చేయడం జరిగిందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు.

మద్యం సేవించి కేసిలో పడిన వ్యక్తి



నాగసత్యనారాయణను కాపడిన యువకులు

ప్రజాశక్తి - పడిద్యాల

మద్యం సేవించిన వ్యక్తి కేసి కేనాల్‌లో జారి పడిన సంఘటన మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో శనివారం రాత్రి 9 గంటలకు చోటు చేసుకుంది. నెహ్రూనగర్ గ్రామానికి చెందిన నాగసత్యనారాయణ మద్యం సేవించి కేసి కెనాల్ వెంట నడిచి వస్తు కాళ్ళు జారి కేసి కెనాల్‌లో పడ్డాడు. ఇది గమనించి అక్కడే ఉన్న యువకులు మహేష్‌నాయుడు, మధు నాయుడు,మధుశంకర్, బండారు శ్రీనివాసులు, మధు నాయుడు, దాహూద్‌ఖాన్‌లు నాగసత్యనారాయణను కాపడా రు. నాగసత్య నారాయణను కాపాడిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

ట్రాన్స్‌ఫారంకు రక్షణ గోడ నిర్మించాలి : వ్యకాసం, సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు


ట్రాన్స్‌ఫారంను చూపిస్తున్న నాయకులు

నందికొట్కూర్ మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారులపై నిర్మించిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌లకు రక్షణ గోడలు కల్పించి ప్రమాదాలు జరగకుండా కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్, సిఐటియు జిల్లా నాయకులు టి గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలో పగిడ్యాల రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యు త్తు ట్రాన్స్ఫార్మర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్, సిఐటియు జిల్లా నాయకులు టి గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్ఫార్మర్లను ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేస్తూ వాటికి రక్షణ కవచాలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. ప్రతిరోజు రోడ్డు వెంట వందలాది వాహనాలు, కాలినడకన వెళ్లే ప్రజలు మూగ జీవాలు అనునిత్యం ట్రాన్స్ఫార్మర్ సమీపంలో సంచరిస్తూంటాయని, రక్షణ కవచం లేకపోవడంతో మూగజీవాలు ప్రమాదాల బారిన పడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు పట్టణంలో వివిధ కాలనీలో రోడ్ సైడ్ ఉన్న ట్రాన్స్ఫార్మర్లకు రక్షణ గోడలను నిర్మించి ప్రమాదాలు నివారించాలని వారు కోరారు. లేనిపక్షంలో ప్రజల సమీకరించి విద్యుత్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

చాపిరేవులలో కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

మండల పరిధిలోని చాపిరేవుల గ్రామంలో కీర్తిశేషులు ఎర్రబోలు సుబ్బారెడ్డి, కీర్తిశేషులు ఎర్రబోలు జయ లక్ష్మమ్మ జ్ఞాపకార్థం చాపిరేవుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మాజీ మార్కెట్ చైర్మన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా పాల్గొనాలని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా తీసుకుని ఆటల పోటీలలో పాల్గొనాలన్నారు.

శ్రీశైలానికి 420 బస్సు సర్వీసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నంద్యాల, కర్నూలు జిల్లాల నుండి శ్రీశైలమునకు మొత్తము 420 బస్సులు నడుపుచున్నట్లు నంద్యాల జిల్లా ప్రజా రవాణా అధికారి టి. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లాలో ముఖ్య శైవ క్షేత్రాలు అయిన మహానంది, ఓంకారము, భోగేశ్వరము, యాగంటి, సంగమేశ్వరము, రుద్రకోడు. క్షేత్రాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండ బస్సులు నడుపుటకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. శ్రీశైలము వెళ్ళుటకు, శ్రీశైలము నుండి తమ గ్రామానికి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు కావాలని అడిగిన ప్రత్యేక బస్సు వేస్తామన్నారు. ఈ సదుపాయము కొరకు సెల్ నంబరు 9959224885 ఫోన్‌ను సంప్రదించిన బస్సు సదుపాయము కల్పిస్తామన్నారు. ఈ మహా శివరాత్రి సందర్భముగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శైవ క్షేత్రాలకు బస్సులు సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు.


ఏఐటియుసి నూతన డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏఐటియుసి నూతన డైరీల ఆవిష్కరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటియుసి నూతన డైరీని నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం పట్టణంలోని ఏఐటియుసి అధ్యక్షుల కుళాయి స్వామి ఆధ్వర్యంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ బాలకృష్ణ, నాయకులు డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శివ బాలకృష్ణ మాట్లాడుతూ 1886 మే1వ తేదీన అమెరికా దేశంలోని చికాగో నగరంలో హే మార్కెట్ దగ్గర లక్షలాది మంది కార్మికులు 10గంటల పని విధానం అమలు చేయాలని నిర్వహింవహించారని తెలిపారు. కార్మిక రక్త తర్పణతో సాధించు కున్న 8గంటల పని విధానాన్ని, నేడు బీజేపీ ప్రభుత్వం 12 గంటల పనివిధానాన్ని ఆములు చేసేందుకు కార్మిక చట్టాలలో మార్పు వేసిందని తెలిపారు. కార్మికుల భద్రత, సమ్మె హక్కు, లాంటి కార్మిక హక్కులను కాలరాస్తు, ప్రవేటీకరణ పేరుతో భారత కార్మిక వర్గం రక్త మాంసాలతో, చమట చుక్కలతో అభివృద్ధి చేసిన ప్రభుత్వ రంగ సంస్థలు రిలయన్స్, ఆధాని, అంబానీలకు అమ్ముతున్నారని విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జి సంజీవులు, ఏపీజీఎస్జిల్లా అధ్యక్షుడు కాలింగిరి రాముడు, చేతి వృత్తిదారుల సంఘం నాయకుడు శివనాగయ్య, ఆటో యూనియన్ నాయకులు బాల ఉసేని, నాగాంజనేయులు, వెంకటేశ్వర్లు,విజయ్ నాయక్, హుస్సేన్ అయ్య, రహీం తుల్లా, మధు సోనా, కార్తీక్, బాల నాయక్ ,సులేమాన్, వెంకట శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నల్లమల అరణ్యంలో వెలిసిన అహోబిలం లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో స్వాతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. అహోబిలం 46వ పీఠాధిపతి శ్రీ వన్ శ్రీ రంగనాథ యతేంద్ర మహాదేశికన్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన స్వాతి వేడుకల్లో లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి పురస్కరించుకొని కాలినడకన అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి నవ నారసింహులను దర్శించుకున్నారు. ఎగువ, దిగువ అహోబిలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిగువ అహోబిలంలోని ఆలయ మండపంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించినంతరం కొలువు ఉంచి స్వామి అమ్మవార్ల ఎదుట సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్య లు, అర్చక బృందం వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వాతి సుదర్శన హోమం నిర్వహించారు. సుదర్శన హోమంలో ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి శైలజ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి సతీమణి గంగుల ఇందిర హోమంలో పాల్గొన్నారు.

హోమం నిర్వహిస్తున్న దృశ్యం


గమ్యస్థానం చేర్చడంలో ఘనుడు

- ఉత్తమ డ్రైవర్‌గా శివప్ప
- 11 పురస్కారాలు సొంతం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రికి చెందిన శివప్ప 1980 నుంచి 1990 వరకు లారీ క్లీనర్, డ్రైవర్‌గా పని చేసి 1991లో ఆర్టీసీ డ్రైవర్‌గా విధుల్లో చేరారు. 32 ఏళ్లపాటు నిరంతరాయం పని చేస్తూ ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో 11 సార్లు ఉత్తమ డ్రైవర్ పురస్కారాలు స్వీకరించారు. ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో పరిధిలో విధులు నిర్వహిస్తున్న శివప్ప పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, డీలక్స్, అల్ట్రా డీలక్స్, లగ్జరీ, సూపర్ లగ్జరీ ఇలా ప్రతి బస్సుకూ డ్రైవర్ విధులు నిర్వర్తించారు. ఆళ్లగడ్డ డిపో నుంచి బెంగళూరు, మంత్రాలయం, హైదరాబాద్, నంద్యాల, కర్నూలు జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాల వరకు ప్రజలను సుర క్షితంగా గమ్యానికి చేర్చడంలో గుర్తింపు పొందారు. ఇప్పటి వరకు 11 సార్లు అవార్డులు స్వీకరించారంటే అతని డ్రైవి ంగ్‌పై ఆర్టీసీ అధికారులకు ఏమేర నమ్మకం ఉందో అర్థం అవుతుంది.

సాధించిన అవార్డులు

1997లో అప్పటి ఆర్ఎం ధర్మారెడ్డి చేతుల మీదుగా తొలిసారి ఉత్తమ డ్రైవర్ అవార్డు స్వీకరించారు. 2002లో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ అవార్డు పొందారు. 2011లో 22వ భద్రతా వారోత్స వాల్లో ఆళ్లగడ్డ డీఎం గిరిధర్రెడ్డి, ఎంవీఐ సురేష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు. అందుకున్నారు. 2014లో 25వ భద్రతా వారోత్సవా ప్రమాద రహిత డ్రైవర్గా డీఎం నాయుడ చేతుల మీదుగా పురస్కారం. 2015లో 26వ రహదారి భద్రతా వారో త్సవాల్లో కర్నూలు ఆర్ఎం కృష్ణమోహన్ చేతుల మీదుగా ఉత్తమ డ్రైవరుగా అవార్డుతోపాటు మూడవ స్థానంలో నిలిచి బహుమతి పొందారు. 2016లో 27వ భద్రతా వారోత్సవా కర్నూలు. అప్పటి ఆర్ఎం వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు తోపాటు మూడవ స్థానంలో నిలిచి ప్రోత్సాహకం అందుకున్నాడు. 2018లో 29వ భద్రతా వారోత్సవాల్లో ఆర్ఎం చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రమాద రహిత డ్రైవర్ అవార్డు, నగదు పారితోషికం పొందారు. 2019లో 30వ రహదారి భద్రతా వారోత్సవాల్లో కర్నూలు అప్పటి ఎస్పీ పక్కీరప్ప, ఆర్ఎం చంద్రశేఖర్ చేతుల మీదుగా ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్ అవార్డు. 2020లో 31వ భద్రతా వారోత్సవాల్లో కర్నూలులో ఆర్ఎం చేతుల మీదుగా ప్రశంసాపత్రం సాధించారు. 2021లో 32వ వారోత్సవాల్లో కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్, ఆర్ఎం టీవీ రామమ్ చేతుల మీదుగా ప్రమాద రహిత డ్రైవర్ పురస్కారంతోపాటు రుగా ఉత్తమ అవార్డు, పారితోషికం పొందారు. ఈ నెల 2న (ఫిబ్రవరి) 34వ రహ దారి భద్రతా వారోత్సవాల్లో నంద్యాల జిల్లాలో రెండో స్థానంలో నిలిచి ఉత్తమ డ్రైవర్ అవార్డు, నగదు బహుమతిని అందుకున్నారు.


ఉత్తమ డ్రైవర్ గా పురస్కారం అందుకుంటున్న శివప్ప

రాష్ట్ర స్థాయి పురస్కారం సాధించడమే లక్ష్యం : శివప్ప, డ్రైవర్

డ్రైవింగ్లో ఉన్నప్పుడు నా కుటుంబంతో పాటు నన్ను నమ్మి బస్సెక్కిన మరో 40 కుటుం బాలు నా మదిలో గుర్తుకొస్తుంటాయి. వారి కుటుంబాలు క్షేమంగా ఉండాలంటే సక్రమంగా డ్రైవింగ్ చేయాలని నిత్యం పరితపిస్తుంటా. మేరో రెండేళ్ల సర్వీసులో రాష్ట్ర స్థాయి పురస్కారం సాధించడమే నా ముందున్న లక్ష్యమని చెప్పారు.

అప్పర్ భద్ర నిర్మాణంతో రాయలసీమకు అన్యాయం

- సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ

ప్రజాశక్తి - నంద్యాల

అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నేతలు పేర్కొన్నారు. రాయలసీమను ఎడారిగా మార్చే అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి వై నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి 5300 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం దారుణం అన్నారు. పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం శంకర్ , తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఖలీల్,సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేంద్ర ప్రసాద్, పిడిఎస్‌యు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎస్ఎండీ రఫీ, ఐయుఎంఎల్ జిల్లా కార్యదర్శి మౌలానా సలాం మూలనా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ సోమన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర జిల్లెల్ల శ్రీరాములు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ ప్రదీప్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం త్వరలో కర్ణాటకలో జరగబోయే శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆ రాష్ట్ర ప్రభుత్వం అడక్కపోయినా 5300 కోట్ల రూపాయలు కేంద్ర బడ్జెట్లో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. దిగువ రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలు వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో కేసు వేశాయని ఆ రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా కేంద్ర జల సంఘం అనుమతి లేకుండ అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించడం కేవలం రాజకీయ లబ్ది కోసమేనని అన్నారు. రాయలసీమకు ప్రధాన జల వనరు అయినా తుంగభద్ర సాగునీటి త్రాగునీటి వనరుగా ఉందని దీన్ని దెబ్బ తీసి రాయలసీమ ప్రాంతానికి తీరని అన్యాయం చేయడానికి బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని విమర్శించారు. రాయలసీమ అభివృద్ధికి బిజెపి కట్టుబడి ఉందని రాయలసీమ డిక్లరేషన్‌లో ప్రకటించుకున్న బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వం రాయలసీమకు అన్యాయం జరిగే విధంగా చేపడుతున్న అప్పర్ బద్ర ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఎలాంటి ప్రకటన చేయకపోవడం కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి దేవకపోవడం చూస్తుంటే ఇది కేవలం కపట ప్రేమని అన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి ఎస్ చౌడప్ప, డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్, ఆదర్శ భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ నాయకులు కాజా మియా, రఫీ, కలాం, అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకెఎంఎస్ నాయకులు డి ఫారూఖ్, పటాన్, యాకూబ్, సామెల్ వలి, పిడిఎస్‌యు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దస్తగిరి, నవీన్, వినోద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నరసింహులు

సిద్దేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించాలి

- రాయలసీమ స్టీరింగ్ కమిటీ

ప్రజాశక్తి - నంద్యాల

కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా 167 కే హైవే నిర్మాణంలో సిద్దేశ్వరం వద్ద కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి బదులు బ్రిడ్జి కం బ్యారేజిని నిర్మించాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఫరూక్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ సిద్దేశ్వరం కృష్ణానది బ్రిడ్జిపై ఐకానిక్ బ్రిడ్జి ఏర్పాటు చేయడం వల్ల కేవలం టూరిజం డెవలప్మెంట్ అవుతుంది తప్ప రాయల సీమ రైతులకు, ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశంలో నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కాకుండా బ్రిడ్జి కం బ్యారేజ్‌ను నిర్మించాలని కోరడం జరిగిందన్నారు. బ్రిడ్జ్ కం బ్యారేజ్ నిర్మించడం ద్వార 70 టీఎంసీల నీటి నిల్వలను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా కర్ణాటక ప్రాంతంలో కర్ణాటక ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అప్రబద్ర ప్రాజెక్టును నిర్మించడానికి నిధులు మంజూరు చేశారని, ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటి సమస్య ఏర్పడుతుందని, ఈ ప్రాజెక్టును నిర్మించకుండా అడ్డుకోవాలని, సీఎం దృష్టికి తీసుకెల తానని అన్నారు. రాయల సీమ ప్రాంత రైతుల, ప్రజల నీటి కష్టాలను తీర్చడానికి ముఖ్యమంత్రి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి మరోసారి సమస్యను తెలియజేస్తామన్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ కన్వీనర్లు మాట్లాడుతూ.. సిద్దేశ్వరం కృష్ణా నదిపై తీగలవంత నిర్మాణం చేపట్టడానికి నిధులు మంజూరయ్యా యని అయితే బ్రిడ్జికం బ్యారేజీ నిర్మించాలని కోరుతూ రాయలసీమ ప్రాంతంలోని 52 మంది ఎమ్మెల్యేల కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఫరూక్ దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రం అందజేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తీగల వంతెన కాకుండా బ్రిడ్జికం మ్యారేజ్ నిర్మిస్తే రాయలసీమ రైతుల కష్టాలు ప్రజల నీటి కష్టాలు తీరుతాయని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు యం. వి. రమణారెడ్డి, రాసామళ్ళ నరసింహ యాదవ్, ఎర్రలింగన్న గారి లింగమయ్య, శీలం నందకుమార్ యాదవ్, శివప్రసాద్ రెడ్డి, గాలి రవిరాజ్, గుంటికపోగు నాగరాజు, మౌలాలి, యం. శ్రీనివాసులు, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శిల్పా రవికి వినతిపత్రం అందచేస్తున్న రాయలసీమ స్టీరింగ్ కమిటీ నేతలు

పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యుటిఎఫ్ సీనియర్ నాయకులు బాలాజీ రావు, సిఐటియు జిల్లా నాయకులు ఏ రణధీర్, సిఐటియు పట్టణ కార్యదర్శి డి రామ్ నాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు నరసింహ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎన్. స్వాములు కోరారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఏ. ధనుంజయ మీటింగ్ హాల్ నందు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నర్సింహారెడ్డి పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు గెలుపును కాంక్షిస్తూ ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోతుల నాగరాజు దాదాపు 33 సంవత్సరాల నుండి అనేక ప్రజా ఉద్యమాలలో భాగస్వాములై ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని వదులుకున్న వ్యక్తి అన్నారు. ప్రశ్నించే వ్యక్తులను శాసనమండలికి పంపియడం వలన ప్రజల గొంతుకగా నిలుస్తూ అనేక సమస్యల పైన చట్టసభలలో తమ వానిని వినిపిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ నాయకులు ఏ సురేంద్ర, మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు గణపతి, మహమ్మద్, ప్రజా సంఘాల నాయకులు బొల్లు ప్రసాద్, గ్రాడ్యుయేట్ ఓటర్లు గోవిందు, నాగరాజు, కాశీ విశ్వనాథ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ సీనియర్ నాయకులు బాలాజీ రావు

బీమాతో కార్యకర్తలకు ధీమా : జనసేన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జనసేన పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న కార్యకర్తల కుటుం బాలకు అండగా నిలవడానికి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ తరపున బీమా సౌకర్యం కల్పించారని, అది కార్యకర్తలకు ఎంతో ధీమా అని తాలూకా జనసేన నాయకులు మైలేరి మల్లయ్య అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ నియోజకవర్గం జనసేన కార్యకర్తల కుటుంబాల కొరకు క్రియాశీలక కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆళ్లగడ్డ జనసేన పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మైలేరి మల్లయ్య మాట్లాడుతూ జనసేన పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న కార్యకర్తల కుటుంబాలను అండగా నిలవడానికి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ తరపున బీమా సౌకర్యం కల్పించారన్నారు. జీవిత బీమా 5 లక్షల రూపాయలుగా, ప్రమాదవశాత్తు గాయపడిన వారికి 50 వేల రూపాయలు జనసేన పార్టీ తరపున బీమా సౌకర్యాన్ని కల్పించారని, కనుక కార్యకర్తలు జనసేన పార్టీ సభ్యత్వం తీసుకొని పార్టీలో సభ్యుడిగా చేరి పార్టీ బలోపేతం దిశగా భాగస్వాములు కావలసిందిగా సూచించారు. సభ్యత కార్యక్రమం ఈ నెల 28వ తారీకు వరకు నిర్వహిస్తామని తెలియజేశారు. నీతి, నిజాయితీ, నిబద్ధత గల నాయకుడు పవన్ కళ్యాణ్ వెంట జనసేన కార్యకర్తలు, అభిమానులు జనసేన పార్టీ కుటుంబంలో చేరి జనసేన పార్టీ బలోపేతం దిశగా భాగస్వాములు కావాలని కోరారు. నేటి వరకు జీవిత బీమా కింద 5 కోట్ల 40 లక్షల 90 వేల రూపాయలు అందజేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవా ఆంజనేయులు, నీరుకట్టు వెంకటరామయ్య, బావికాడి గుర్రప్ప, సజ్జల నాగేంద్ర, చైతన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నాయకులు

రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఓడించండి : టిడిపి

ప్రజాశక్తి - బేతంచర్ల

రాష్ట్రంలోని ప్రజలపై అధిక భారాలు మోపుతున్న వైసీపీ జగన్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని తెలుగుదేశం పార్టీ డోన్ నియోజకవర్గం ఇంచార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బేతంచెర్ల మండల కేంద్రంలోని నగర పంచాయతీ ఆరవ వార్డులో కౌన్సిలర్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి, తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వర్ రెడ్డి, రాఘవరెడ్డి మండల కన్వీనర్ ఉన్నం ఎల్లా నాగయ్య పట్టణ ప్రధాన కార్యదర్శి శిక్షావలి చౌదరి మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తర్వాత ప్రజలపై అధిక బారాలు మోపి చెత్త పన్ను ఇంటి పన్ను వంటి వాటిపై అధిక వసూలు చేస్తూ సామాన్య మధ్యతరగతి ప్రజలపై భారాల ఒత్తిడి పెట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అందుకే రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు అనే ఆయుధంతో వైఎస్ఆర్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పి తెలుగుదేశం పార్టీని గెలిపించి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా అవసరమని వారన్నారు. తెలుగుదేశం పార్టీ డోన్ నియోజకవర్గం సలహాదారులు మురళీకృష్ణ గౌడ్, తిరుమలేష్ చౌదరి, ఎమ్మెస్ బాష, మధులోకేశ్వర్ రెడ్డి, సెటిల్మెంట్ శెట్టి, కౌన్సిలర్ రామాంజి, రామనాథం, శివ, మధు, తదితరులు పాల్గొన్నారు.


ఇదేం కర్మ రాష్ట్రానికి స్టిక్కర్లను చూపిస్తున్న టిడిపి నాయకులు


పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు

బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో నందికొట్కూరులోని జీవన జ్యోతి స్కూల్ దగ్గర ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు బిజెపి అసెంబ్లీ ఇన్చార్జ్ కొండే పోగు చిన్న సుంకన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు అనేవి యువకులకు ఉత్సాహాన్ని ధైర్యాన్ని నింపుతాయన్నారు. ఫైనల్‌గా నిలిచిన 3టిమ్స్‌కి బైరెడ్డి శబరి రెడ్డి చేతుల మీదుగా బహుమతి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి లీగల్ సెల్ అసెంబ్లీ ఇన్చార్జి నాగమద్దిలేటి అడ్వకేట్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బోరెల్లిశివ, బీజేవైఎం మండల అధ్యక్షులు నాగ స్వామి, బీజేవైఎం కొత్తపల్లి మండల అధ్యక్షులు ప్రదీప్ కుమార్, టోర్నమె ంట్ ఆర్గనైజర్స్ బైరెడ్డి మౌలాలి,జలీల్, సిరాజ్, బాష, ఇర్ఫాన్, పాల్గొన్నారు.

ఇకెవైసి చేయించుకుంటేనే లబ్ధి

- జిల్లా వ్యవసాయ అధికారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ కేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వము ద్వారా వచ్చే లబ్ధి రైతులకు చేకూరుతుందని జిల్లా వ్యవసాయ అధికారి టి మోహన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రైతులు ఓటీపీ పద్ధతిలో కానీ వేలిముద్ర ద్వారా కానీ ఈ –కేవైసి చేయించుకోవచ్చన్నారు. అలాగే ఎన్‌పిసిఐ అనగా బ్యాంక్ అకౌంట్‌కి మొబైల్ నెంబర్‌కి అను సంధానము కాని రైతులు పోస్ట్ ఆఫీస్‌లో రూ.50లు చెల్లించి అకౌంట్ ఓపెన్ చేయడము ద్వారా వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే13వ విడత పిఎం కిసాన్ లబ్ధి వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.

చౌడేశ్వరి దేవస్థానం అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానం ఆలయ అభివృద్ధికి గుంటూరుకు జిల్లాకు చెందిన కాచర్ల సత్యనారాయణ, ధర్మపత్ని జ్యోతి లక్ష్మి లు రూ 90వేల నగదును ఆలయ కార్య నిర్వహణాధికారి వి.ఎల్.యన్. రామానుజన్‌కు ఆదివారం అందజేశారు.


చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం ఇస్తున్న భక్తులు

జెఇఇ ఫలితాల్లో రావూస్ విజయదుందుబి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 7వ తేదీన ఎన్‌టిఎ ప్రకటించిన 2023 జేఈఈ ఫలితాలలో రావుస్ విద్యార్థులు విజయదుందుబి మోగించారని చైర్మన్ అప్పరావు తెలిపారు. విద్యార్థులు ఆర్ సాయి శ్రీ 92.65, ఏ. అక్షిత లక్ష్మి 89.69, ఎస్.అయోష 88.86, ఏ జి ఎన్ అజయ్ రెడ్డి 87.41తో పాటు 80 పర్సంటేలు పైన ఏడు మంది, 70 పర్సెంటిల్‌పైన 18 మంది సాధించారని తెలిపారు. ఇంతవరకు నంద్యాల చరిత్రలో రావుస్ విద్యార్థి ఎస్ఎం సాజిద్ 99.77 పర్సంటేజ్ సాధించి ఆల్ టైం రికార్డ్ సాధించారని చైర్మన్ తెలిపారు. ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జేఈఈ అధ్యాపకులు రఘు రాముడు, శ్రీమన్నారాయణ, రోషన్ జమీర్, సుధాకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్స్ సుంకయ్య, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో రావుస్ విద్యాసంస్థలు యాజమాన్య

త్వరలో శనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

- మార్క్ ఫెడ్ ప్రతినిధి ప్రవీణ్


ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డలో శనగల కొనుగోలు కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేయబోతున్నట్లు మార్క్ ఫెడ్ ప్రతినిధి ప్రవీణ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ తర్వాత కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నామన్నారు. క్వింటాల్ శనగల మద్దతు ధర రూ.5335 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో 31,924 మంది రైతులు సెనగ పంటను సాగు చేశారన్నారు. ఈ నెల 13 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు .

ఎంఎల్‌సి ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి - పగిడ్యాల

ఎంఎల్‌సి ఎన్ని ఓటర్ల జాబితాను విడుదల చేసిన్నట్లు ఎంపిడిఒ వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశల మేరకు ఎంఎల్‌సి ఎన్నికల నిమిత్తం మండలంలోని జెడ్పిటిసి, ఎంపిటిసిల జాబితను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో జెడ్పిటిసి, 10 ఎంపిటిసిలు ఉన్నారన్నారు. వీటిపై ఏమైన అభ్యంతరాలు ఉన్నచో ఈ నెల 18వ తేదిలోపు ఫారం 17 నందు అభ్యంతరాలను ఉమ్మడి జిల్లా కర్నూల్ కలెక్టర్‌కు అందజేయలన్నారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న కౌన్సిలర్ జాకీర్

వివాహ వేడుకల్లో.. మొల్ల జాకీర్ హుస్సేన్

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని అల్లూరు రోడ్డులోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో బైసాని సురేష్ కుమార్తె వివాహానికి నందికొట్కూరు రెండవ వార్డు కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్ ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధువులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు, రఘురాం మూర్తి, వైయస్సార్సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ పసుల శ్రీనివాసులు నాయుడు, శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.